ఈదమ్మ ఆలయానికి మైక్‌సెట్ అందజేత



మైక్ సెట్‌ను అందజేస్తున్న రాజేశ్

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని ఈదమ్మ తల్లి దేవాలయానికి రాజేశ్ అనే భక్తుడు మంగళవారం మైక్ సెట్‌ను అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులకు ముందుకు రావాలని దేవాలయ నిర్వాహకులు కోరారు. మైక్‌సెట్ అందజేసిన దాత రాజేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మనూలో 'నాలెడ్జ్ సిరీస్ లెక్చర్'

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'నాలెడ్జ్ సిరీస్ లెక్చర్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో 'డిజిటల్ యుగంలో సాంస్కృతిక వ్యక్తీకరణల వైవిధ్యం: అవకాశాలను వినియోగించుకోవడం, సవాళ్ళను నావిగేట్ చేయడం' అనే అంశంపై ప్రముఖ చిత్ర నిర్మాత, రచయిత, టీవీ ప్రముఖుడు సిదార్థ్ కాక్ ఉపన్యసిస్తారని ఆయన పేర్కొన్నారు.

నేడు 'సైబర్ క్రైమ్'పై అవగాహన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బుధవారం 'సైబర్ క్రైమ్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూలోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ కార్యాలయం, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ టీమ్, తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీజీసీహెచ్ఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ క్యాంపస్‌లోని సీఐఎస్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది.విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక



నేషనల్ పోటీలకు ఎంపికైన బాక్సర్లు

గోల్కొండ: ఈనెల 31 నుంచి ఉత్తరఖండ్‌లో ప్రారంభం కానున్న 38వ నేషనల్ గేమ్స్‌కు షేక్‌పేట్‌కు చెందిన ఇద్దరు బాక్సర్లు ఎంపికైనట్లు షేక్‌పేట్ ఇండోర్ స్టేడియం బాక్సింగ్ కోచ్ శివకుమార్ తెలిపారు. స్టేడియంలో మంగళవారం వారిని సన్మానించి పోటీలకు పంపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. ఎలిట్ పురుషుల విభాగంలో పవన్‌కల్యాణ్ 60-63.5 కేజీల విభాగంలో, ఎలిట్ మహిళా విభాగంలో 52-60 కేజీల విభాగంలో మహిళా బాక్సర్ సి.అపర్ణ పోటీపడనున్నట్లు తెలిపారు. తనతో పాటు పి.వినేశ్‌బాబు కోచింగ్ ఇచ్చారని పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్-ఏ-మేరాజ్



షబ్-ఏ-మేరాజ్ ప్రత్యేకతలను వివరిస్తున్న మౌలానా సాజిద్

శాలిబండ: శాలిబండ ఖాజీపురాలోని నవ ఈద్ మసీద్‌లో సోమవారం రాత్రి షబ్-ఏ-మేరాజ్ ప్రార్థనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మౌలానా సాజిద్ షబ్-ఏ-మేరాజ్ ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా సాజిద్ మాట్లాడుతూ.. షబ్-ఏ-మేరాజ్ ముస్లింలకు పవిత్రమైన రాత్రిగా గుర్తించబడుతుందన్నారు. ఈ దివ్య రాత్రిలో ప్రత్యేక నమాజ్‌లు, ఖురాన్ పఠనం, దువాలు చేయడం లాంటివి ముస్లింలు పాటించారు. ఈ రాత్రి అల్లాహ్ కరుణను పొందే సందర్భంగా ముస్లిం సోదరులు, పెద్దలు, పిల్లలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు.

చెత్తను స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలి

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌నగర్ కాలనీవాసులు



చెత్త సేకరణ తీరును పరిశీలిస్తున్న బండ్లగూడ జాగీరు కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు కమిషనర్ శరత్‌చంద్ర కోరారు. మంగళవారం 14వ డివిజన్‌లోని అక్బర్‌నగర్ కాలనీ, 13వ డివిజన్‌లోని వెస్టెండ్ కాలనీ, 12వ డివిజన్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలలో చెత్త సేకరణ తీరును ఆయన నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయొద్దని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా భద్రపరిచి ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు రామంజులు, సుభాష్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వినాయక్‌నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు మురళీకృష్ణ అధికారులను కోరారు. మంగళవారం కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. సరైన డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపానన్నారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరానన్నారు. త్వరలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు సి.బాబు, కృష్ణ, శ్రావణ్, సందీప్, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాల తరలింపు వేలం పూర్తి



మాట్లాడుతున్న బండ్లగూడ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చూసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాలను సేకరించి తరలించేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. మెరైన్ ఫుడ్స్ అండ్ ఫీడ్ సంస్థ వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. రూ.1.19 లక్షలకు వేలం దక్కించుకున్నారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 2025 నుంచి జనవరి 2028 (36 నెలలు) వరకు కొనసాగుతుందన్నారు. వేలం దక్కించుకున్న నిర్వాహకులు ఏడాదికి రూ.1.19లక్షలు చెల్లిస్తారని తెలిపారు. దుకాణాల నిర్వాహకుల నుంచి వ్యర్థాలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తారని అన్నారు. దీనికి మాంసం దుకాణాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

రాయదుర్గం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం 'డయల్ యువర్ డిపో మేనేజర్' కార్యక్రమం జరుగుతుందని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫోన్‌లో చెప్పవచ్చని తెలిపారు. ఫోన్ నంబర్ 9959226132లో చెప్పాలని తెలిపారు.

వంటగది సీజ్

గచ్చిబౌలి: అపరిశుభ్రంగా ఉన్న చైతన్య కళాశాల సెంట్రల్ కిచెన్‌ను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని వశిష్ఠ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెంట్రల్ కిచెన్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరగడం, అపరిశుభ్ర వాతావరణం ఉందని అనేక పర్యాయాలు ఫిర్యాదులు రావడంతో ఈ నెల 24న ఫుడ్ సేఫ్టీ అధికారులు కిచెన్‌ను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంతో లైసెన్స్ రద్దు చేశారు. సెంట్రల్ కిచెన్ నుంచి శ్రీ చైతన్య కళాశాలలకు ఆహారం సరఫరా చేస్తున్నారు. లైసెన్స్ రద్దు చేసినా కిచెన్ యథావిధిగా కొనసాగిస్తుండడంతో ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ కర్ణన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల మంది విద్యార్థులు తినే ఆహారం విషయంలో శ్రీచైతన్య యాజమాన్యం నిర్లక్ష్యం వహించడంతో కిచెన్‌ను సీజ్ చేశామన్నారు.

నేటి నుంచి మ్యూజిక్ ఫెస్టివల్

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నేటి నుంచి హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన మ్యూజిక్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. ఫిబ్రవరి రెండవ తేదీ వరకు సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలతో కళాకారులు సందర్శకులను అలరించనున్నారు. చివరి రోజు నగర సంకీర్తనతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.

ఇళ్ల సర్వే 80 శాతం పూర్తి

ఉపకమిషనర్ రవికుమార్



వార్డు సూపర్‌వైజర్లతో సమావేశమైన డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే వార్డు సూపర్‌వైజర్లతో మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తుదారుడి వద్దకు వెళ్తున్నామని అన్నారు. వారి వద్ద నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 80 శాతం సర్వే పూర్తయిందని వెల్లడించారు. సర్వే సిబ్బంది సర్వే తీరును వార్డు సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు జరిగే సర్వే తీరును పరిశీలించి సూచనలు చేస్తున్నామని అన్నారు. సాధ్యమైనంత త్వరగా సర్వేను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సర్వే సిబ్బంది, వార్డు సూపర్‌వైజర్లు సైతం అనుకున్న సమయం కంటే ముందుగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి వద్దకు తప్పనిసరిగా వెళ్లాలన్నారు. అప్పుడే వంద శాతం సర్వే పూర్తి చేయగలమని అన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి

మున్సిపల్ కమిషనర్లకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశం



మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మున్సిపాలిటీలలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులతో సమన్వయం చేసుకుని సకాలంలో పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. దుబాయ్ పర్యటన ముగించుకుని వచ్చిన ఆయన మంగళవారం మణికొండ, నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీలతో పాటు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల పాలన ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోందని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలిగినా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. అలాంటి పరిస్థితి తమ నియోజకవర్గంలో రాకుండా చూసుకోవాలని సూచించారు. జఠిలమైన సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు డి.ప్రదీప్‌కుమార్, టి.కృష్ణమోహన్‌రెడ్డి, శరత్ చంద్ర, సుమన్‌రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా పలు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని, హెల్మెట్, సీటు బెల్టు తప్పకుండా ధరించాలన్నారు. సిగ్నల్ జంప్ చేయవద్దని, స్టాప్ లైన్ వద్ద ఆగాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఫిట్‌నెస్ ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నింబంధనలు తూచా తప్పకుండా పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్‌కాలనీలోని తన కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్, లంగర్‌హౌస్, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల నుంచి మహిళలతో పాటు పలు కుటుంబ సభ్యులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆసరా పింఛన్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కొన్ని దరఖాస్తులనే అధికారులు సర్వే కోసం ఎంపిక చేశారని, అలాగే రేషన్ కార్డులు, పింఛన్లు సర్వే కొనసాగుతుందని అర్హులందరికీ అందుతాయని ఆందోళన చెందవద్దని సూచించారు. త్వరలోనే రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పెండింగ్ దరఖాస్తుల విషయమై చర్చిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు రఫత్‌హుస్సేన్, ఆలీముద్దీన్ ఉన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



చార్మినార్: ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాతబస్తీ ఉర్దూఘర్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా రిపబ్లిక్ డే స్కూల్ చెస్ టోర్నీ-2025 విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. గోల్కొండలోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన ఎం.విద్యాధర్ ప్రథమ బహుమతి సాధించారు. అలాగే నాచారంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన మహమ్మద్ షబ్బీర్ అహ్మద్, తాహెర్ మునీర్, మంగలపల్లి శ్రీధర్, మహ్మద్ సాహిర్ అహ్మద్, హరీశ్ తర్వాత స్థానాల్లో నిలిచారు. వీరికి సంఘం చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ, కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీతో పాటు సిరాజుద్దీన్ తదితరులు బహుమతులతో పాటు మెమొంటోలు అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



రాజ్యసభ సభ్యుడు డా. కె.లక్ష్మణ్‌ను కలిసిన మణికొండ బీజేపీ నాయకులు

మణికొండ: రాష్ట్రంలో బీజేపీ గాలి మరింత వీస్తోందని రాబోయే అన్ని ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ నాయకులు మంగళవారం ఆయనను కలిశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని వారికి సూచించారు. మణికొండ మున్సిపాలిటీలో బీజేపీకి అధికారం చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఎన్నికలకు ప్రతి నాయకుడు సిద్ధంగా ఉండాలన్నా రు. మెజార్టీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా గెలిచి అధికార ం లోకి రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీకాంత్‌స్వామి, శ్వేత రవికాంత్‌రెడ్డి, ఎల్.వందన నగేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జె.సిద్ధప్ప, మున్సిపాలి టీ పార్టీ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నాయకులు ఇంది ర, సి.బీరప్ప, శ్రీనివాస్‌రెడ్డి, వేణుకుమార్, పి.సత్యనారాయణ, శంకర్‌సింగ్, రాజేశ్, వెంకటాచారి పాల్గొన్నారు.

అడ్డాపై రూ.5 భోజనం ఏర్పాటు చేయాలి



లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

శంషాబాద్: పట్టణంలోని లేబర్ అడ్డా వద్ద రూ.5 భోజనం స్టాల్ ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు నర్రగిరి రాజు, నరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం లేబర్ అడ్డా వద్ద కార్మికులతో కలిసి మాట్లాడారు. పట్టణంలో ఉపాధి కోసం ప్రతిరోజు వేలాది మంది కార్మికులు చేరుకునే అడ్డా వద్ద పనులు దొరకని ఎందరో పస్తులుంటున్నారని అన్నారు. తక్కువ ఖర్చుతో కూడిన రూ.5 భోజనం ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై మరోమారు మున్సిపాలిటీ అధికారులకు వివరిస్తామని తెలిపారు.

స్టార్టప్‌ల అభివృద్ధికే 'టీ-ఎడ్జ్'



టీహబ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 'టీ-ఎడ్జ్' కార్యక్రమాన్ని మంగళవారం ప్రకటించారు. పకడ్బందీ వ్యూహం, ఆవిష్కరణలతో స్టార్టప్‌లను అభివృద్ధి చేయడానికి భారతదేశంలోని ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ టీహబ్ దాని న్యాయ, ఆర్థిక బృందం కలిసి టీ-ఎడ్జ్‌ను ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. చట్టపరమైన, ఆర్థిక సేకరణ విషయాలపై సమగ్ర సలహాలను అందించడం ద్వారా స్టార్టప్‌లను బలోపేతం చేయడంపై టీఎడ్జ్ దృష్టి సారిస్తుందన్నారు.

టీ హబ్-నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం మధ్య భాగస్వామ్యం

టీహబ్- నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంల మధ్య భాగస్వామ్యం కుదిరింది. అనంతరం 'ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్'ను వేగవంతం చేయడంలో ఐపీ పాత్ర' అనే అంశంపై ప్యానల్ చర్చను నిర్వహించారు. టీహబ్ ఉపాధ్యక్షుడు సంతోషిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐపీఆర్ చైర్ డాక్టర్ అనింద్య సర్కార్, ఆస్కార్ లీగల్ సర్వీసెస్ వ్యవస్థాపకులు నవీన్‌కుమార్, రీసల్యూట్ గ్రూప్, రెసల్యూట్ 4ఐపిలో లీగల్ హెడ్ శుభజిత్‌సాహ, ఓభన్ అండ్ అసోసియేట్స్‌లో భాగస్వామి చారుల్‌యాదవ్ పాల్గొని తమ అభిప్రాయాలను ప్రకటించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన కాపీరైట్ సవాళ్ళు, ప్రపంచ పేటెంట్లను దాఖలు చేయడానికి ఆచరణాత్మక విధానాలు, అంతర్జాతీయ మార్కెట్లలో అమలు, సవాళ్లపై సమావేశంలో చర్చించారు.

గుంతల్.. చింతల్.!

- ధ్వంసమైన కాలనీల ప్రధాన, అంతర్గత రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు



గుంతలమయంగా మారిన రోడ్డు



మధుబన్ కాలనీలో రోడ్డు ఇలా..

డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ, టీఎన్జీవోస్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీలలో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం డివిజన్ ప్రజలకు శాపంగా మారింది. మధుబన్‌కాలనీ నుంచి శ్రీరామ్ కాలనీకి భారీ కంటెయినర్లు, లారీలు, బస్సులు వెళ్లడంతో రోడ్లు గుంతలుగా మారుతున్నాయి. జీహెచ్ఎంసీ కార్యాలయానికి వెళ్లి అడిగితే నిధుల కొరత ఉందని చెబుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారికి సీసీరోడ్డు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతకంటే ముందు ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీలలో పర్యటించి రోడ్ల దుస్థితిని నేరుగా తెలుసుకోవాలన్నారు. అప్పుడు తామ పడే బాధలు వారికి అర్థమవుతాయని స్థానికులు చెబుతున్నారు. – మైలార్‌దేవ్‌పల్లి

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ప్రధాన రహదారులపై వాహనం నడపాలంటే ఇబ్బందిగా ఉంది. కాలనీలో ఉన్న రోడ్లు కూడా గుంతలుగా మారాయి. గుంతలు లేకుండా అధికారులు చూడాలి. అప్పుడే రాకపోకలకు మాకు ఇబ్బందులు తప్పుతాయి.
– రమేష్, వాహనదారుడు